సాక్షి పశ్చిమగోదావరి

ఆదివారం । 27 । అక్టోబర్ । 2024



ఎరువుల కొనుగోలులో జాగ్రత్తలు

క్రిమి సంహారక మందులు, విత్తనాలు, ఎరువుల కొనుగోలులో రైతులు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ అధికారులు సూచించారు.

8లో ▸



జంటగానే మృత్యుఒడిలోకి..

గేదెలు మేపుకునేందుకు వెళ్లిన భార్యాభర్తలు చెరువులో పడి మృతిచెందిన విషాద ఘటన నూజివీడు మండలం పోతురెడ్డిపల్లిలో చోటుచేసుకుంది.

8లో ▸

బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం

మార్టేరులో మూడు రోజులపాటు జరిగే రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల అండర్–17 బాస్కెట్ బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. 13 జిల్లాల జట్లు వచ్చాయి.



8లో

న్యూస్‌రీల్

శ్రీనివాసుడి సన్నిధిలో త్రిపుర గవర్నర్



వేంకటేశ్వరస్వామి సన్నిధిలో త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలోని పద్మావతి వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని త్రిపుర గవర్నర్ ఎస్.ఇంద్రసేనారెడ్డి శనివారం సందర్శించారు. ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు ఆలయ మర్యాదలతో ఆయన్ను సత్కరించారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఆర్డీఓ ప్రవీణ్, తహసీల్దార్ రవి రాంబాబు, భారతీయ విద్యాభవన్ చైర్మన్ ఉద్దరాజు విశ్వనాథరాజు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

నేడు నిట్‌కు..

తాడేపల్లిగూడెం: త్రిపుర గవర్నర్ ఎస్.ఇంద్రసేనారెడ్డి ఆదివారం సాయంత్రం ఏపీ నిట్‌లో స్పందన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొంటారు. అకడమిక్ అచీవ్‌మెంట్స్, బూస్ట్ సెల్ఫ్ కాన్ఫిడెన్స్ అనే కార్యక్రమంలో విద్యార్థుల ముఖాముఖీలో పాల్గొంటారు. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తదితరులు హాజరవుతారని స్పందన నిర్వాహకురాలు భోగిరెడ్డి ఆదిలక్ష్మి తెలిపారు.

ఎస్ఎస్‌సీ ఫీజులు చెల్లించాలి

భీమవరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు ఫీజు చెల్లింపునకు ఈనెల 28 నుంచి వచ్చేనెల 30 వరకు అవకాశముందని డీఈఓ ఈ.నారాయణ శనివారం ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాధ రుసుంతో నవంబర్ 11 నుంచి 18 వరకు, రూ.200 అపరాధ రుసుంతో 18 నుంచి 25 వరకు, రూ.500 అపరాధ రుసుంతో 26 నుంచి 30 తేదీ వరకు అవకాశముందని పేర్కొన్నారు. రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు రూ.125, మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులు ఉంటే రూ.125, మూడు సబ్జెక్టుల వరకు రూ.110, ఒకేషనల్ విద్యార్థులు రూ.125 ఫీజుతోపాటు అదనంగా రూ.60, మైగ్రేషన్ సర్టిఫికెట్ కోసం రూ.80 చెల్లించాలని వివరించారు.

నిత్యాన్నదానానికి విరాళాల వెల్లువ



దాతలకు విరాళం బాండ్ అందిస్తున్న ఈఓ

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు శనివారం దాతలు రూ.12,01,348లను విరాళంగా అందించారు. కృష్ణా జిల్లా మొవ్వ మండలం పెదపూడికి చెందిన వేములపల్లి వెంకట రామదాసు రూ.9 లక్షలు, కంచర్ల మంగారావు (హైదరాబాద్) రూ.1,00,116, సీహెచ్ సంధ్య (హైదరాబాద్) రూ.1,00,116, శ్రీపాద లక్ష్మీ నరసింహ రూ.1,01,116లను విరాళంగా అందించారు. దాతలకు ఈఓ ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, ఏఈఓ పి.నటరాజారావు, సూపరింటెండెంట్ జి.సుబ్రహ్మణ్యం విరాళం బాండ్‌లను అందించారు.

పోటెత్తిన భక్తులు: శ్రీవారి క్షేత్రంలో శనివారం భక్తులు పోటెత్తారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఆలయ అనివేటి మండపం, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు ఇతర విభాగాలు భక్తులతో రద్దీగా కనిపించాయి.

కృష్ణా కెనాల్ ఏఈగా దుర్గారావు

ఏలూరు రూరల్: కృష్ణా కెనాల్ అసిస్టెంట్ ఇంజినీర్‌గా సీహెచ్ దుర్గారావు నియమితులయ్యారు. విజయవాడ నుంచి ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ పనిచేసిన సుబ్రహ్మణ్యం పెదవేగి బదిలీ అయ్యారు. కొత్తముప్పర్రుతో పాటు ఏలూరు రూరల్ మండలంలో మొత్తంగా 9 సాగునీటి సంఘాల పరిధిలో కాలువల పర్యవేక్షణ, నిర్వహణ బాధ్యతలను దుర్గారావు నిర్వహించనున్నారు.

ఈఆర్‌సీ ఉత్తర్వులు దారుణం

ఏలూరు (టూటౌన్): ఎఫ్‌పీపీసీఏ చార్జీల పేరిట ప్రజలపై రూ. 6,072 కోట్ల భారాన్ని విధిస్తూ ఏపీ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ (ఈఆర్‌సీ) ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి శనివారం విలేకరులతో మాట్లాడారు. 2022–23లో వినియోగించిన విద్యుత్‌కు ఈనెల నుంచి 2026 జనవరి వరకు యూనిట్‌కు సుమారు 83 పైసలు అదనంగా చెల్లించాలనే ఉత్తర్వులు పేదలకు పెనుభారంగా మారుతుందన్నారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు నియంత్రిస్తాం, విద్యుత్ బిల్లుల భారం తగ్గిస్తాం అని ఉమ్మడి మేనిఫెస్టోలో హామీలిచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఏకంగా 44 శాతం పెంపుదలకు పూనుకోవడం దారుణమన్నారు.

రైతులపై ప్రీమియం పిడుగు

సాక్షి, భీమవరం: సాగులో రైతుకు ధీమానిస్తూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలుచేసిన ఉచిత పంటల బీమా పథకానికి కూటమి సర్కారు మంగళం పాడింది. వచ్చే రబీ సీజన్ నుంచి రైతులే ప్రీమియం చెల్లించుకోవాలని స్పష్టం చేసింది. ఎకరాకు రైతు ప్రీమియం వాటా రూ.615లు కాగా జిల్లాలో రైతులపై రూ.14.15 కోట్ల భారం పడనుంది.

విపత్తులో ఆదుకునేలా..

వర్షాలు, వరదలతో పంటకు నష్టం వాటిల్లినప్పుడు పరిహారం రూపంలో రైతులను ఆదుకునేందుకు పంటల బీమా పథకం దోహదపడుతుంది. బీమా కంపెనీ లెక్కించిన పంట విలువలో రెండు శాతం ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాలి. పసల్ బీమా యోజన ద్వారా గతంలో 1.5 శాతం రైతు చెల్లిస్తే, 0.5 శాతం ప్రీమియాన్ని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చెల్లించేవి. బ్యాంకుల నుంచి రైతులు పంట రుణాలు తీసుకునే సమయంలో బ్యాంకులే పంటకు బీమా చేయించేవి. ప్రీమియం గడువుపై సమాచారం కొరవడటం, పంట రుణాల విడుదలలో జాప్యంతో చాలా మంది రైతులు ప్రీమియం చెల్లించేవారు కాదు. విపత్తులతో పంట దెబ్బతిన్నప్పుడు బీమా వర్తించక తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చేది.

ఉచితంతో ధీమా ఇచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

రైతుపై ప్రీమియం భారం పడకుండా 2019 ఖరీఫ్ నుంచి ఉచిత పంటల బీమా పథకాన్ని అమల్లోకి తెచ్చారు గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఈక్రాప్ నమోదు ప్రామాణికంగా సాగు విస్తీర్ణం అంతటికీ రైతులు చెల్లించాల్సిన ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తూ వచ్చింది. దీనివలన పంటల బీమా గురించి రైతులకు ఇబ్బందులు తప్పాయి. సాగు చేసిన ప్రతి ఎకరాకు బీమా పథకం వర్తించడంతో పంట నష్టం వాటిల్లినప్పుడు రైతులతో పాటు గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం అందేది. గత ఐదేళ్లలో ఏటా 1.4 లక్షల చొప్పున జిల్లాలోని ఏడు లక్షల మంది తరఫున ప్రీమియం రూపంలో బీమా కంపెనీలకు దాదాపు రూ.140 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. పంట నష్టపోయిన 1,14,011 మంది రైతులకు రూ.217.64 కోట్ల పరిహారం అందించడం ద్వారా అండగా నిలిచింది.

ప్రీమియం భారం మోపిన కూటమి సర్కారు

ఉచిత పంటల బీమా పథకానికి కూటమి ప్రభుత్వం ఎసరు పెట్టింది. రానున్న రబీ సీజన్ నుంచి రైతులే ప్రీమియం చెల్లించుకోవాలి. ఎకరాకు పంట విలువ రూ.41,000లో ప్రీమియంగా రెండు శాతం మొత్తం రూ.820లు బీమా కంపెనీకి చెల్లించాల్సి ఉంది. దీనిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 0.5 శాతం వాటా అంటే రూ.205లు చెల్లిస్తే, మిగిలిన 1.5 శాతం మేర రూ.615లు రైతులే చెల్లించాలి. జిల్లాలోని 2.3 లక్షల ఎకరాల్లో రబీ సాగు జరుగనుండగా పంటల బీమా ప్రీమియం రూపంలో రైతులపై రూ.14.15 కోట్ల భారం పడనుంది.

డిసెంబరు 15 లోపు ప్రీమియం చెల్లించాలి

రానున్న దాళ్వా సీజన్‌కు గాను డిసెంబరు 15 నాటికి పంటల బీమా నమోదు ప్రక్రియ పూర్తిచేయాలని అధికారులకు ఆదేశాలందాయి. కామన్ సర్వీస్ సెంటర్లు (సీఎస్‌సీ), సచివాలయాల్లో రైతులు తమ ప్రీమియం సొమ్మును చెల్లించవచ్చని సూచిస్తున్నారు.

ఉచిత బీమా.. లేదిక ధీమా


- ఉచిత పంటల బీమాకు మంగళం
- రైతులు ప్రీమియం చెల్లిస్తేనే బీమా వర్తింపు
- ఎకరాకు రైతు వాటా రూ.615
- జిల్లాలో రైతులపై రూ.14.15 కోట్ల భారం
- ఉచిత పంటల బీమాను అమలు చేసిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

గత ప్రభుత్వంలో ఉచిత పంటల బీమా

- జిల్లాలో ప్రీమియం వర్తింపు సుమారు 7 లక్షల మందికి..
- బీమా కంపెనీలకు ప్రభుత్వం చెల్లించింది రూ.140 కోట్లు
- రైతులకు పంట నష్టపరిహారం చెల్లింపు 1,14,011 మందికి రూ.217.64 కోట్లు



రైతులంటే చిన్నచూపే



రైతులన్నా, వ్యవసాయమన్నా సీఎం చంద్రబాబుకు ఎప్పుడూ చిన్నచూపే. ఉచిత పంటల బీమాను ఎత్తివేసి మరోమారు ఆ మాటను నిజం చేసుకున్నారు. గత సీఎం జగన్ తెచ్చిన ఈ పథకం రైతులకు ఎంతో మేలు చేసింది.

– కొండవేటి సాంబశివరావు (శివయ్య), రైతు, సర్పంచ్ చెరుకువాడ

రైతులకు చేసిందేమీ లేదు



రైతుల కోసం ఎన్నో చేస్తామంటూ ఎన్నికల్లో కూటమి నాయకులు ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలైనా చేసిందేమీ లేకపోగా ఉన్న వాటిని ఎత్తివేసి రైతులపై ఆర్థిక భారం మోపడం సరికాదు. ఉచిత పంటల బీమా పథకాన్ని అమలుచేయాలి.

– కౌరు రామాంజనేయులు, రైతు, లక్ష్మణేశ్వరం

అదనపు భారంగా..



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పంటల బీమా ప్రీమియాన్ని రైతు చెల్లించాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం భరించింది. నష్టపరిహారం సకాలంలో అందింది. కూటమి ప్రభుత్వం రైతుని మోసం చేసి అదనపు భారం మోపింది.

– సాకా సుబ్రహ్మణ్యం, దేవ, పెనుగొండ మండలం

ప్రభుత్వమే భరించి ఉపశమనం కల్పించాలి



పంటల బీమా పథకాన్ని ప్రభుత్వమే భరించి రైతులకు ఉపశమనం కల్పించాలి. భారీ వర్షాలు, వరదలతో ఇప్పటికే తొలకరి పెట్టుబడులు రెట్టింపై ఇబ్బంది పడుతున్నాం. రైతులను ఆదుకోవాల్సింది పోయి భారం మోపుతున్నారు.

– జవ్వాది శేషగిరిరావు, ప్రత్తిపాడు

ప్రీమియం చెల్లించడం మర్చిపోతే నష్టమే..



గతంలో సమాచారం లేక చాలామంది ప్రీమియం చెల్లించక తీవ్రంగా నష్టపోయేవారు. ఉచిత పంటల బీమాతో ఆ సమస్య తీరింది. ఇప్పుడు ఆ పథకాన్ని ఎత్తివేయడం వల్ల ఎవరైనా ప్రీమియం చెల్లించడం మర్చిపోతే నష్టపోక తప్పదు.

– నబ్బితి రాజేష్, కౌలు రైతు, అత్తిలి

బాలల హక్కులను కాపాడాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తంకుమార్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జడ్జి పురుషోత్తం కుమార్. చిత్రంలో కలెక్టర్ నాగరాణి

భీమవరం: చిన్నారుల హక్కులను తెలియజేయడంలో ప్రతిఒక్కరూ కీలకపాత్ర పోషించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ పురుషోత్తంకుమార్ అన్నారు. శనివారం స్థానిక డీఎన్నార్ కాలేజీలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, భీమవరం మండల సర్వీసెస్ ఆధ్వర్యంలో ది రైట్ ఆఫ్ ది చిల్డ్రన్ ఫర్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ నల్సా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాలల హక్కులను ప్రతిఒక్కరూ కాపాడాలన్నారు. 1992లో చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ చట్టం ద్వారా బాల్య వివాహాలు, బాల కార్మికులను నిరోధించడం, 1993లో విద్యా హక్కు చట్టం, 1996లో బాల కార్మిక వ్యవస్థ నిషేధిత చట్టాన్ని అమల్లోకి తెచ్చారన్నారు. కలెక్టర్ సీహెచ్ నాగరాణి మాట్లాడుతూ బాలల వికాసం అవసరమని దానికి ఆరోగ్యకరమైన వాతావరణంలో వారి సంరక్షణ ఉండాలన్నారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ బాలల చట్టాలపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్, పోస్కో ఏడీజే సోమశేఖర్, ఫోర్త్ ఏడీజే డి.సత్యవతి, ఏడీజే విజయదుర్గ, ఏఎస్పీ వి.భీమారావు, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి బి.సుజాతరాణి, జిల్లా కార్మిక శాఖ అధికారి ఎ.లక్ష్మి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వై.యోహాన్, డీఎన్నార్ కళాశాల వైస్ ప్రెసిడెంట్ గోకరాజు పాండురంగరాజు పాల్గొన్నారు.

పట్టభద్రులూ.. ఓటు నమోదు చేయించుకోండి

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాదరాజు



సాక్షి, భీమవరం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అర్హులైన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఓటరు నమోదులో భాగస్వాములు కావాలన్నారు. ఆయా నియోజకవర్గాల్లోని విద్యావంతులను గుర్తించి వారిని ఓటర్లుగా చేర్పించేందుకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జులతో శుక్రవారం పెదఅమిరంలో జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించామన్నారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం పాలనలో పూర్తిగా విఫలమైందని, సూపర్ సిక్స్ హామీలు అమలుచేయలేక ప్రజల దృష్టిని మరల్చేందుకు దుష్ట రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. తాము ప్రభుత్వ వైఫల్యాల్ని ఎండగడుతూ, పోరాటాలు చేస్తూ ప్రజల పక్షాన నిలబడుతున్నామని చెప్పారు. ప్రతి కార్యకర్త, ఆపదలో ఉన్న ప్రతిఒక్కరికీ వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని ప్రసాదరాజు స్పష్టం చేశారు.

ఇళ్ల పరిహారంలో నిర్వాసితులకు అన్యాయం

వేలేరుపాడు: వేలేరుపాడు మండలంలోని జగన్నాథపురం గ్రామంలో 140 మంది నిర్వాసితుల ఇంటి విలువల అవార్డులో పేర్లు తొలగించడంపై సీపీఐ నాయకులు తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య మాట్లాడుతూ ఇంటి విలువల పరిహారం విషయంలో నిర్వాసితులకు తీరని అన్యాయం చేస్తున్నారన్నారు. స్పెషల్ కలెక్టర్ స్థాయి అధికారులు అవకతవకలకు పాల్పడితే ఎలా అని ప్రశ్నిస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. జగన్నాథపురంలో 140 మంది పేర్ల తొలగింపునకు కారణాలు అధికారులు తెలపాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలన్నారు. ఈ ప్రాంతంలోనే పుట్టి పెరిగి 60 ఏళ్లు దాటిన కుటుంబాల పేర్లను కూడా తొలగించడం దారుణమన్నారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎండీ మునీర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు సన్నేపల్లి సాయిబాబు, రామవరం సర్పంచ్ పిట్ట ప్రసాద్, ఏపీజీఎస్ జిల్లా కార్యదర్శి కారం దారయ్య, మండల కార్యదర్శి బాడిస రాము, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రా మధు, నిర్వాసితులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

తీరంలో బెల్ట్ షాపుల వేలం

రెండేళ్లకు రూ. 2.20 లక్షలకు పాట

నరసాపురం: నరసాపురం తీర ప్రాంత గ్రామం చినమైనవానిలంకలో ఓ ప్రాంతంలో బెల్ట్ షాపు ఏర్పాటుకు శనివారం నిర్వహించిన వేలం పాట హాట్‌టాపిక్‌గా మారింది. రెండేళ్ల కాలపరిమితికి రూ.2.20 లక్షలకు ఓ వ్యక్తి వేలంలో షాపు దక్కించుకున్నాడు. సదరు బెల్ట్‌షాపు పెట్టబోయే ప్రాంతానికి సంబంధించి మద్యం దుకాణం లైసెన్స్ దక్కించుకున్న వ్యక్తి జనసేన చోటానేత కాగా, బెల్ట్ షాపును వేలంలో దక్కించుకుంది ఓ టీడీపీ కార్యకర్త. ఇక్కడ నిస్సిగ్గుగా బెల్ట్ షాపునకు వేలం జరపడంపై జనం ముక్కున వేలేసుకుంటున్నారు. చుట్టుప్రక్కల ప్రాంతాల్లో వేట సాగించే మత్స్యకారులే అధిక సంఖ్యలో ఉన్నారు. వీరివి రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబాలు. కూటమి ప్రభుత్వం కొత్త మద్యం పాలసీ పుణ్యమా ఇళ్ల మధ్యకే బెల్ట్ షాపులు వచ్చి చేరుతున్నాయి. నిరుపేద కూలీలు రోజంతా కష్టపడిన సొమ్మును మద్యానికి తగలేస్తారని మహిళలు ఆవేదన చెందుతున్నారు. దివంగత వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉండగా తీరంలో నాటుసారాను పూర్తిగా నిర్మూలించారు. 2019–24 కాలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామాల్లో బెల్ట్‌షాపులే లేకుండా చేసింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చి మళ్లీ బెల్ట్‌షాపుల రూపంలో మద్యం కుంపట్లు రాజేయడంపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. వైఎస్సార్, జగన్ పాలనను తీరగ్రామాల ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. బెల్ట్ షాపుల వేలంపై ఎక్సైజ్ అధికారులు ఏం చర్యలు తీసుకుంటారనేది చూడాలి మరి.

ధాన్యం కొనుగోలుకు సర్వం సిద్ధం

జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

తాడేపల్లిగూడెం రూరల్/తణుకు టౌన్: జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేశామని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం తాడేపల్లిగూడెం మండలంలోని పెదతాడేపల్లి రైతు సేవా కేంద్రంలో ఆయన సమావేశం నిర్వహించారు. అలాగే తణుకు మండలం తేతలిలో రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో 340 రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈనెల 29న పెదతాడేపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తామన్నారు. రైస్ మిల్లర్ నుంచి తీసుకొచ్చిన గోనె సంచులు, తేమ శాతం కొలిచే పరికరాలు సిద్ధంగా ఉంచాలని సిబ్బందికి ఆదేశించారు. రైతులు కోరిన విధంగా గోనె సంచులు అందించాలన్నారు. రైతులు ధాన్యాన్ని ఎక్కడైనా విక్రయించుకునేలా ఏర్పాటు చేశామన్నారు. జిల్లా పరిధిలో జాయింట్ కలెక్టర్ లాగిన్ నుంచి, జిల్లా దాటి వెళితే సివిల్ సప్లయిస్ ఎండీ లాగిన్ నుంచి అనుమతి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. ఆర్డీఓ వై.భవాని శంకరి, జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు పి.మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.



తణుకు మండలం తేతలి కేంద్రంలో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

విద్యుత్ సంస్కరణలు ఆందోళనకరం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యుత్ రంగంలో సంస్కరణలు ఆందోళన కలిగిస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ 327 ఐదు జిల్లాల డిస్కం అధ్యక్షుడు భూక్యా నాగేశ్వరరావు నాయక్ అన్నారు. యూనియన్ 70 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా స్థానిక విద్యుత్ స్టోర్స్‌లో ఏలూరు డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు పాతాళ శ్రీనివాస్ అధ్యక్షత వహించగా నాగేశ్వరనాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వి.రాము మాట్లాడుతూ విద్యుత్ సంస్థలను అదానీ గ్రూపునకు కట్టబెట్టి ప్రైవేట్‌పరం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలు, జిల్లా విభజన వల్ల కార్మికులకు ఇబ్బందులు లేకుండా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టాలని కోరారు. మానవ హక్కుల చైర్మన్ కంభంపాటి రామమోహనరావు మాట్లాడుతూ సమైక్యంగా ఉంటూ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. డివిజన్ కార్యదర్శి జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పోలీస్ ఓపెన్ హౌస్



ఓపెన్ హౌస్‌లో పోలీస్ జాగిలం విన్యాసం



ఆయుధాల పనితీరును వివరిస్తున్న ఎస్పీ శివకిషోర్



వ్యక్తిగత భద్రతపై అవగాహన కల్పిస్తూ..

ఏలూరు టౌన్: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో పోలీస్ ఓపెన్ హౌస్‌ను నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఓపెన్ హౌస్‌ను ప్రారంభించి, విద్యార్థులకు పోలీసులు వినియోగించే ఆయుధాలు, అత్యాధునిక పరికరాలపై అవగాహన కల్పించారు. డాగ్ స్క్వాడ్ విన్యాసాలు అలరించాయి. నేరస్తులను, బాంబులను గుర్తించటం, క్రమశిక్షణతో డాగ్ హ్యాండ్లర్స్ ఆదేశాలు పాటించే తీరు విద్యార్థులను ఆకర్షించాయి. జిల్లా ఎస్పీ విద్యార్థులతో మమేకమయ్యారు. అమరవీరుల సంస్మరణ దినం ఔన్నత్యాన్ని వివరించారు. పోలీస్ శాఖ వినియోగించే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, క్లూస్ టీం, కమ్యూనికేషన్స్, డాగ్ స్క్వాడ్ విన్యాసాలు, 303 తుపాకీ, 7.62 ఎంఎం సెల్ఫ్ లోడింగ్ రైఫిల్, 9 ఎంఎం పిస్టల్, కార్బైన్, ఎంపీ–5కే సబ్‌మెషిన్ గన్, 0.22 రైఫిల్, 5.56 ఎంఎం ఇన్సాస్, 762 ఎంఎం ఏకే 47, టియర్ గ్యాస్ గన్ ఆయుధాల పనితీరును జిల్లా ఎస్పీ వివరించారు. ఏఆర్ అదనపు ఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ శ్రీహరి, ఆర్ఐ పవన్‌కుమార్, ఎస్బీ సీఐ మల్లేశ్వరరావు, డీసీఆర్‌బీ సీఐ విజయ్‌కుమార్, సీఐలు కోటేశ్వరరావు, ఎం.సుబ్బారావు, ఎస్సై క్రాంతిప్రియ, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ ప్రభావంపై అవగాహన


మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉషాదేవి

తాడేపల్లిగూడెం: రాబోయే కాలంలో హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ ప్రభావం ఎక్కువగా ఉంటుందని కాకినాడ జేఎన్‌టీయూ కంప్యూటర్ సైన్సు ఇంజనీరింగ్ విభాగం సహాయ ఆచార్యుడు డాక్టర్ ఉషాదేవి అన్నారు. హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్‌పై వాసవీ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కంప్యూటింగ్ ఆర్కిటెక్చర్, సిస్టమ్స్, హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ ఇన్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ అప్లికేషన్స్ గురించి వివరించారు. ప్రిన్సిపాల్ రత్నాకర్‌రావు, టెక్నికల్ డైరెక్టర్ చెక్కా అప్పారావు, కో ఆర్డినేటర్ లోష్మా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోవింద నామ స్మరణతో మార్మోగిన క్షేత్రం


భక్తుల మెడలో మాలలు వేస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: శ్రీనివాసా గోవిందా.. శ్రీ వేంకటేశా గోవిందా అంటూ శ్రీవారి దీక్షాధారులు చేసిన భజనలు, గోవింద నామ స్మరణలతో చినవెంకన్న క్షేత్రం మార్మోగింది. మండలంలోని వెంకటకృష్ణాపురానికి చెందిన 30 మంది శ్రీవారి భక్తులు శనివారం మండల (41 రోజుల) దీక్షను చేపట్టారు. ముందుగా వారు ఆలయ ముఖ ద్వారం వద్దకు చేరుకోగా, అర్చకులు వారి మెడలో మాలలు వేశారు. అనంతరం వారంతా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 41 రోజుల పాటు తాము స్వామి దీక్షను చేపడతామని, ఆ తరువాత గిరి ప్రదక్షిణ చేసి, ఇరుముడులు సమర్పిస్తామని తెలిపారు.

విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు తప్పనిసరి

పాడు - పంట

చింతలపూడి: ప్రస్తుతం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో చాలా చోట్ల వరి పంట పొట్ట దశలో ఉంది. మెరక భూముల్లో వేరుశెనగ, మొక్కజొన్న పంటలు వేసుకోవడానికి సమాయత్తమవుతున్నారు. క్రిమి సంహారక మందులు, విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడంలో రైతులు నిమగ్నమయ్యారు. అయితే వ్యవసాయ శాఖ నుంచి లైసెన్స్ పొందిన కంపెనీల నుంచి మాత్రమే పురుగు మందులు కొనుగోలు చేయాలని చింతలపూడి వ్యవసాయ సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ బి.నాగకుమార్ సూచిస్తున్నారు.

లైసెన్స్ పొందిన దుకాణాలలో బిల్లుల ద్వారానే పురుగు మందులు కొనుగోలు చేసి బిల్లులను పంటకోత వరకు భద్రపరుచుకోవాలి. ప్రభుత్వ అనుమతి లేని కంపెనీల ఉత్పత్తులు కొనొద్దు. పురుగులు, తెగుళ్ల నివారణకు వాడే ఏ ఉత్పత్తులైనా క్రిమిసంహారక మందుల చట్టం -1968 ప్రకారం ప్రభుత్వ అనుమతి తప్పని సరి. అనుమతి పొందిన విత్తన కంపెనీలు, ఎరువుల కంపెనీలు, సస్యరక్షణ మందుల కంపెనీల వివరాలు వ్యవసాయశాఖ తెలియజేస్తుంది.


మెట్ట ప్రాంతంలో క్రిమి సంహారక మందులు పిచికారీ చేస్తున్న దృశ్యం


బి నాగకుమార్, ఏడీఏ, చింతలపూడి

జాగ్రత్తలు ఇలా..

- విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు ప్యాకింగ్‌పై విత్తనం పేరు, రకం, మొలక శాతం, లేబుల్ తప్పని సరిగా చూసుకోవాలి. బిల్లుపై విత్తనం పేరు, కంపెనీ పేరు, రకం, ల్యాబ్ నెంబర్, గడువు తేదీ తప్పనిసరిగా సరిచూసుకోవాలి.
- విత్తనాలు కొనుగోలు చేశాక తప్పని సరిగా విత్తనశుద్ధి చేసుకోవాలి. వంద విత్తనాలు తీసుకుని మొలకశాతం సరిగా ఉందో లేదోనని పరీక్షించుకుని తరువాత మాత్రమే విత్తనాలను వెదజల్లుకోవాలి.
- ఎరువుల కొనుగోలు సమయంలో బిల్లులో కంపెనీ పేరు, ఎరువు పేరు, తయారీ తేదీ, గరిష్ట చిల్లర ధర, తూకం సరి చూసుకోవాలి. నిర్ణయించిన ధరకు మాత్రమే కొనుగోలు చేయాలి. సూక్ష్మ ధాతు ఎరువులు కొనుగోలు చేసినప్పుడు ప్రభుత్వం అనుమతితో తయారు చేసిన సంస్థల ఉత్పత్తులను మాత్రమే కొనాలి. లూజు విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు ఎట్టి పరిస్థితుల్లో కొనొద్దు.

పురుగు మందుల కొనుగోలులో జాగ్రత్తలు

క్రిమి సంహారక మందులు కొనుగోలు చేసినప్పుడు బిల్లులో మందు పేరు, కంపెనీ పేరు, గడువు తేది, బ్యాచ్ నెంబర్ వివరాలు చూసుకోవాలి. సీలు ఉండి, లీకేజీ లేకుండా లేబుల్ ఉందో లేదో చూసుకోవాలి. పురుగు మందుతో పాటు దానికి సంబంధించిన కరపత్రంతో అసలైన ప్యాకింగ్ మాత్రమే కొనుగోలు చేయాలి. కరపత్రంలో ఉన్న వివరాల ప్రకారం మందును వాడాలి. మోసపూరిత మాటలు నమ్మి రైతులు విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు తెలియని వ్యక్తుల నుంచి కానీ.. గ్రామాల్లో వచ్చి అమ్మే వ్యక్తుల నుంచి కానీ కొనుగోలు చేయరాదు.

ఇరు వర్గాల మధ్య ఘర్షణ


రమణక్కపేటలో ఘర్షణ పడుతున్న ఇరు వర్గాలు

ముసునూరు: ఇల్లు కడుతున్నామని చెప్పి అనుమతి లేకుండా చర్చి నిర్మించడంపై ఒక వర్గం ఫిర్యాదు చేయగా, తమపై దాడికి దిగారంటూ మరో వర్గం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మండలంలోని రమణక్కపేటలో బైబిల్ మిషన్ పేరుతో పాస్టర్ కె.కరుణానిధి 2022లో అనుమతులు లేకుండా చర్చి నిర్మాణం ప్రారంభించారు. ఆ వీధి ప్రజలంతా అడ్డు కోవడంతో అప్పట్లో నిలిపి వేశాడు. రెండేళ్ళ అనంతరం శుక్రవారం మళ్ళీ ఇల్లు కడుతున్నానంటూ, చర్చి నిర్మాణం ప్రారంభించారు. దీంతో ఆగ్రహించిన స్థానికులు అతన్ని నిలదీశారు. ఇల్లే కడుతున్నానంటూ తిరిగి శనివారం చర్చి నిర్మాణ పనులు చేయిస్తుండగా అందరూ అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాలు గొడవ పడ్డాయి. ఇరువర్గాలు శనివారం సాయంత్రం ముసునూరు పోలీస్‌స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు.

జంటగానే మృత్యుఒడిలోకి..

చెరువులో మునిగి దంపతుల మృతి


నూజివీడు మండలం పోతురెడ్డిపల్లిలో చెరువులో పడి మృతిచెందిన దంపతులు

నూజివీడు: గేదెలు మేపుకునేందుకు వెళ్లిన భార్యాభర్తలు చెరువులో పడి మృతిచెందిన హృదయ విదారకర సంఘటన ఇది. కష్ట సుఖాల్లో ఇంతవరకు తోడూనీడగా ఉన్న వీరు జంటగానే మృత్యువు ఒడికి చేరారు. నూజివీడు మండలం పోతురెడ్డిపల్లికి చెందిన కొండ రాంబాబు(42), కొండ ప్రశాంతి(35) గేదెలు మేపుకునేందుకు రోజూ పొలానికి వెళ్తారు. ఇదే క్రమంలో శనివారం వెళ్లిన దంపతులు సాయంత్రం 5 గంటల సమయంలో గేదెలను తోలుకొని ఇంటికి వస్తుండగా గేదెలు చెరువులోకి దిగాయి. వాటిని పైకి తోలేందుకు రాంబాబు చెరువులోకి దిగాడు. మెడ లోతుకు వెళ్లిన తరువాత ఒక్కసారిగా మునిగిపోతుండగా భార్య ప్రశాంతి చెరువులోకి దిగి చీర వేసింది. చీర భర్తకు అందకపోవడంతో ఈమె మరింత లోతుకు వెళ్లింది. అదే సమయంలో ఆమె కూడా మునిగిపోయింది. ఇద్దరూ మునిగిపోతున్న దృశ్యాన్ని సమీపంలోని కరెంటు స్తంభంపై మరమ్మతులు చేస్తున్న విద్యుత్ లైన్‌మెన్ చూసి వెంటనే సమీపంలో ఉన్న వారికి తెలిపాడు. వారు చెరువు వద్దకు వచ్చి చూసేసరికి దంపతులిద్దరూ మృతిచెందారు. మృతదేహాలను చెరువు నుంచి వెలికి తీశారు. వీరికి వివాహమై 15 ఏళ్లు కాగా.. పిల్లలు లేరు. మృతుడి తల్లిదండ్రులు, సోదరులు కన్నీరుమున్నీరుగా రోదిస్తుండటం చూపరులను కంటతడి పెట్టించింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

అండర్ 17– బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం


మార్టేరులో అంతర్ జిల్లాల క్రీడా పోటీలకు హాజరైన విద్యార్థులు

పెనుమంట్ర: ఎందరినో ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దిన ఘనత మార్టేరు శ్రీ వేణుగోపాల ఉన్నత పాఠశాలకు దక్కుతుందని తణుకు డీవైఈవో ఎస్. మురళీ సత్యనారాయణ అన్నారు. మార్టేరులో మూడు రోజులు పాటు జరిగే రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల అండర్-17 బాస్కెట్ బాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రారంభ సభలో మాట్లాడుతూ పాఠశాలలో చదివి ఆడిన ఎందరో విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించారని, అందులో తాను ఒకడినని చెప్పారు. మరో ముఖ్య అతిథి నర్సాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ సత్తి సుబ్బన్న రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి స్నేహపూర్వక వాతావరణంలో పాల్గొని క్రీడల్లో రాణించాలన్నారు. సభ అనంతరం పోటీలను ప్రారంభించారు. 13 జిల్లాల నుంచి వచ్చిన బాల బాలికల జట్లను ముఖ్య అతిథులు పరిచయం చేసుకున్నారు. స్కూల్ గేమ్స్ కార్యదర్శి బీఎస్ఎన్ మల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీఎఫ్‌వ జాయింట్ సెక్రటరీ జి.చక్రవర్తి, గవర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కర్రి కృష్ణారెడ్డి, హెచ్ఎం చర్ల సూర్యనారాయణ రెడ్డి, కోనల సూర్యనారాయణ రెడ్డి, ఆది రెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


డీఎన్నార్ కళాశాలలో ప్రిన్సిపాల్ నుంచి ఫిర్యాదు తీసుకుంటున్న పోలీసులు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు పట్టణంలో డీఎన్నార్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించారు. కళాశాలలో యుజీసీ హాస్టల్ భవనం పై అంతస్తులో శుభ్రం చేసేందుకు కళాశాల స్వీపర్ పైకి ఎక్కగా వెనుక ప్రహరీగోడకు మధ్యలో ఉన్న స్థలంలో ఓ మృతదేహం ఉన్నట్లు గుర్తించి కళాశాల ప్రిన్సిపాల్‌కు చెప్పింది. పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహం అస్థిపంజరంలా మారిపోయింది. కళాశాల ఇండోర్ స్టేడియం వద్దకు తీసుకువచ్చి అక్కడే పంచనామా నిర్వహించారు. ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ పీయుష్ వర్మ పంచనామా నిర్వహించి సుమారు 60 నుంచి 70 ఏళ్ల పురుషుడి మృతదేహంగా నిర్ధారించారు. మృతదేహం పడి సుమారు 20 రోజులు కావస్తుందని తెలిపారు. భవనంపై నుంచి జారి పడిపోయి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని మున్సిపల్ సిబ్బంది ఖననం చేశారు.

ఎస్ఆర్‌కేఆర్‌లో బాస్కెట్‌బాల్, నెట్‌బాల్ పోటీలు


బాస్కెట్‌బాల్, నెట్ బాల్ పోటీలకు హాజరైన క్రీడాకారులు

భీమవరం: భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండ్రోజుల పాటు నిర్వహించే జేఎన్‌టీయుకె సెంట్రల్ జోన్ అంతర్ కళాశాలల బాస్కెట్ బాల్, నెట్‌బాల్ పోటీలను శనివారం కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్ రంగరాజు, ప్రిన్సిపల్ కెవీ మురళీకృష్ణంరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడల కమిటీ కన్వీనర్ పి.సత్యనారాయణరాజు మాట్లాడుతూ జేఎన్‌టీయూకే పరిధిలో 21 బాస్కెట్ బాల్ టీమ్స్, 10 నెట్ బాల్ టీమ్స్ హాజరయ్యారన్నారు. బాస్కెట్‌బాల్ పోటీల పరిశీలకుడిగా విజయవాడ లయోలా కళాశాలకు చెందిన రాజేష్, ఒంగోలు డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ అథారిటీ నుంచి శ్రీనివాసరావు హాజరయ్యారన్నారు. నెట్‌బాల్‌కు వైజాగ్ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ నుంచి బి.వెంకటేశ్వర్లు, పశ్చిమగోదావరి జిల్లా నెట్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ ఖాన్ హాజరయ్యారని తెలిపారు.

ఆర్టీసీ బస్సును వెంబడించిన ఆకతాయిలు


ఆకతాయిలు వెంబడించిన జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో బస్సు

జంగారెడ్డిగూడెం: మద్యం సేవించి, బస్సును వెంబడించి భయభ్రాంతులకు గురిచేసిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. దీనిపై ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు ఆశ్వారావుపేట వెళ్లి తిరిగి వస్తోంది. జీలుగుమిల్లి సెంటర్ దాటిన తరువాత ఇద్దరు వ్యక్తులు బస్సుకు బైక్ అడ్డుపెట్టి ఘర్షణకు దిగారన్నారు. కొద్ది సేపటి తరువాత బస్సు బయలుదేరింది. ఈ సమయంలో మరో మూడు మోటార్‌సైకిళ్లపై ఆరుగురు వ్యక్తులు బస్సును వెంబడించడం మొదలు పెట్టారు. దీంతో భయభ్రాంతులకు గురైన ప్రయాణికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోకి బస్సు తిరిగే సరికి వెనక్కి వెళ్లిపోయారు. పోలీసులు బస్సు అశ్వారావుపేట రోడ్డుకు వచ్చేసరికి అక్కడకు చేరుకుని ఘటనపై ప్రయాణికుల నుంచి సమాచారం తెలుసుకున్నారు. తమతో గొడవపడి, బస్సును ఎందుకు వెంబడించారో తెలియదని.. ఆ వ్యక్తులు తాగేసి ఉన్నారని డ్రైవర్, కండక్టర్ తెలిపారు.

40 కేజీల గంజాయి స్వాధీనం


పెనుగొండలో గంజాయిని స్వాధీనం చేసుకొన్న పోలీసులు

పెనుగొండ: పెనుగొండ మార్టేరు రహదారిలో లారీలో తరలిస్తున్న 40 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పెనుగొండ ఎస్సై కే గంగాధరరావు తెలిపారు. కచ్చితమైన సమాచారం రావడంతో డిప్యూటీ తహసీల్దారు దిగమర్తి రాజేష్, వీఆర్వోలు, స్టేషన్ సిబ్బందితో కలిసి శనివారం పెనుగొండ శివారు తూరల కంపెనీ వద్ద కర్ణాటకకు చెందిన లారీలో మూడు సంచుల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. లారీ డ్రైవరు ప్రసన్న, క్లీనరు శ్రీకాంత్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కేసును పెనుగొండ సీఐ రాయుడు విజయ్‌కుమార్ దర్యాప్తు చేస్తున్నారు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


ప్రమాదంలో మృతిచెందిన విచిత్ర రాజు

ఉంగుటూరు : బాదంపూడి వై జంక్షన్ వద్ద శనివారం జరిగిన ప్రమాదంలో బాదంపూడికి చెందిన కోడి విచిత్ర రాజు (38) మృతిచెందాడు. బైక్‌పై బాదంపూడి నుంచి ఉంగుటూరు వైపు వెళ్తుండగా.. జీపు వేగంగా ఢీకొనడంతో అక్కడకక్కడే మృతిచెందాడు. మృతదేహన్ని ఎస్‌ఐ సూర్యభగవాన్ పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

నూజివీడు: నూజివీడు బైపాస్ లో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఆటోను ఢీకొట్టడంతో ముసునూరు మండలం చింతలవల్లి గ్రామానికి చెందిన పల్లిపాము ప్రతాప్(49) అక్కడికక్కడే మృతి చెందాడు. ఢీకొట్టిన వాహనం ఆపకుండా వెళ్లిపోయింది. సమీపంలో ఉన్న వ్యక్తి చూసి సమాచారాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో వారు సమాచారాన్ని నూజివీడు పట్టణ పోలీసులకు తెలిపారు. మృతదేహాన్ని నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. బైపాస్ రోడ్డులో హనుమాన్ జంక్షన్ వైపు నుంచి విస్సన్నపేట వైపు వెళుతున్న ఆటోను చేపలు తరలించే వాహనం ఢీ కొట్టి వెళ్లిపోయినట్లు అనుమానిస్తున్నారు. సీఐ సత్య శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరాలు పరిశీలించి వాహనాన్ని గుర్తిస్తామని పోలీసులు తెలిపారు.

గోదావరిలో దూకి యువకుడి గల్లంతు


యలమంచిలి: కోనసీమ జిల్లా మలికిపురం మండలం కత్తిమండ గ్రామానికి చెందిన పెచ్చెట్టి ఏసురాజు (32) శనివారం గోదావరిలో దూకి గల్లంతైనట్లు అతని తండ్రి రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కర్ణీడి గుర్రయ్య తెలిపారు. కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన ఏసురాజు ఇంటి నుంచి బయటకు వచ్చేశాడు. ఫోన్, చెప్పులు చించినాడ వద్ద వశిష్ట గోదావరి నది వంతెనపై ఉండడం గమనించిన స్థానికులు ఆ ఫోన్‌తో అతని తండ్రికి కాల్ చేశారు. తండ్రి వచ్చి ఫోన్, చెప్పులు కుమారుడివేనని గుర్తించారు. గోదావరిలో దూకి ఉంటాడనే అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి ఏసురాజు కోసం గోదావరిలో గాలిస్తున్నట్లు ఎస్సై గుర్రయ్య వివరించారు.

తలమానికం.. ఆదినాథ్ ఆలయం

- కార్తీక పౌర్ణమి నాడు జైనుల ప్రత్యేక పూజలు
- కాళ్ళ మండలం పెద అమిరంలో భూగర్భం నుంచి వెలికితీసిన విగ్రహం
- కోట్లాది రూపాయలతో పాలరాతి జైన దేవాలయం నిర్మాణం


పెదఅమీరంలో పాలరాతితో కట్టిన జైన్ ఆదినాథ్ దేవాలయం


ఆలయంపై పాలరాతితో చెక్కిన కళాత్మక చిత్రాలు


ఆదినాథ్ భగవానుడు

కాళ్ల: దేశంలోని జైనులకు ప్రీతిపాత్రం కాళ్ల మండలం పెద అమిరంలోని ఋషభ(ఆది)నాథుని దేవాలయం. అందులో జైనుల ప్రథమ తీర్థంకరుడి ప్రతిమ విశిష్టమైన శిల్పకళా నైపుణ్యంతో అలరారుతుంటుంది. స్వయంభూ ఋషభ(ఆది)నాథ్ దేవాలయం జిల్లాకే తలమానికం. ఈ ఆలయంలో ఉన్న తీర్థాధిపతి విగ్రహం సుమారు 2500 సంవత్సరాల పురాతనమైనదని భావిస్తారు. జైన తీర్థంకరుల్లో మొదటి తీర్థంకరుడైన ఆదినాథ్ కొలువైన ఈ ఆలయానికి ఏటా కార్తీక పౌర్ణమి రోజున దేశం నలుమూలల నుంచి జైనులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేస్తుంటారు. కార్తీక మాసం సమీపిస్తున్న వేళ ఈ ఆలయ విశిష్టత గురించి తెలుసుకుందాం.

ఈ విగ్రహం పెద అమిరం గ్రామంలో సుమారు 150 ఏళ్ల క్రితం పంట పొలాల పక్కన పెద్ద గోతి నుంచి బయటపడిందని ఆలయ నిర్వాహకులు చెబుతారు. ఈ రాతి విగ్రహంపై పిల్లలు ఆడుకొనేవారు. రజకులు బట్టలు ఉతికేవారు. కొంత కాలానికి గ్రామంలో కరువు ఏర్పడి భయంకరమైన వ్యాధులు వ్యాపించాయి. గ్రామానికి చెందిన ఒక స్త్రీ కలలో.. ఇది రాయి కాదని దేవుని విగ్రహం అంటూ దివ్య వాణి వినిపించింది. ఆ కల గురించి ఆమె గ్రామ పెద్దలకు చెప్పడంతో వారు ఒక దిమ్మ కట్టి దాని మీద ఆ విగ్రహం స్థాపించి భక్తి శ్రద్ధలతో పూజించారు. ఫలితంగా గ్రామంలో సుఖశాంతులు వెలిశాయని చెబుతుంటారు. సుమారు 100 ఏళ్ళ క్రితం గ్రామస్తులు విగ్రహాన్ని జైన విగ్రహంగా భావించి భీమవరంలోని జైనులకు దీని గురించి తెలియజేశారు. జైనులు ఈ విగ్రహాన్ని పరిశీలించి అది జైన విగ్రహమేనని నిర్ధారించి విగ్రహాన్ని భీమవరం తీసుకు వెళ్ళి దేవాలయం నిర్మిస్తామని పెదఅమిరం గ్రామస్తులను కోరగా గ్రామస్తులు అందుకు వ్యతిరేకించినారు. అప్పుడు భీమవరం, గుడివాడ, విజయవాడ, గుంటూరు, నరసాపురం, రాజమండ్రి, తణుకులోని జైనులు ఏకమై గ్రామస్తుల సహకారంతో పెదఅమిరంలోనే జైనదేవాలయం నిర్మించారు.

2015లో పాలరాతి దేవాలయం నిర్మాణం

పూర్తి పాలరాతితో ఇక్కడ మందిరం నిర్మించేందుకు ట్రస్ట్ బోర్డు నిర్ణయించింది. 2008లో నూతన పాలరాతి దేవాలయ నిర్మాణం ప్రారంభించి 2015 ఫిబ్రవరి 2న ఆదినాథ్ విగ్రహం తోపాటు మరో 23 విగ్రహాలను ప్రతిష్టించారు. ప్రతిష్ఠ సమయంలో ప్రత్యేక హెలీకాప్టర్ ద్వారా ఆలయంపై వివిధ రకాల పూలతో అభిషేకం చేశారు.

ఆదినాథ్‌పై అపార నమ్మకం

పెదఅమిరం గ్రామ ప్రజలకు ఆదినాథ్ విగ్రహంపై భక్తిశ్రద్ధలు అపారమైనవి. ఈ దేవాలయాన్ని సందర్శిస్తే తమ కోరికలు తప్పక నెరవేరుతాయని వారి నమ్మకం. సకాలంలో వర్షం కురవకపోతే 108 బిందెలతో లేక 108 కొబ్బరికాయలతో అభిషేకం చేస్తే వర్షం తప్పక కురుస్తుందని ప్రజల నమ్మకం. ఇది జైన పుణ్యక్షేత్రమైనా ఇప్పుడు పరమత సహనానికి ప్రతీకగా దేవాలయం నిలుస్తోంది.

ఆన్‌లైన్ యాప్ ఘరానా మోసం

ద్వారకాతిరుమల మండలంలోనే 500 మందికి పైగా బాధితులు

ద్వారకాతిరుమల : ఏఎస్‌ఓ పేరిట నిర్వహిస్తున్న ఆన్‌లైన్ యాప్ ఘరానా మోసం తాజాగా వెలుగు చూసింది. ఈ యాప్‌లో రూ.2 వేలు పెట్టుబడి పెడితే రోజుకు రూ.80, రూ.6,150 పెడితే రోజుకు రూ.220 ఇస్తాం.. ఎంత ఎక్కువ కడితే రోజుకు అంతమేర ప్రతిఫలం వస్తుందని నమ్మబలుకుతారు. పెట్టుబడి పెట్టిన వారందరితో రెండు వాట్సాప్ గ్రూపులు క్రియేట్ చేసి, కొన్నాళ్ల పాటు నమ్మకంగా బాధితుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమచేసి ఆకర్షించారు. సులువుగా డబ్బు వస్తుందన్న ఉద్దేశంతో ద్వారకాతిరుమలతో పాటు, మండలంలోని దొరసానిపాడు, గుండుగొలనుకుంట తదితర గ్రామాల ప్రజలు, రాజమండ్రి, భీమవరం వంటి పట్టణ ప్రాంత వాసులు వేలాది మంది ఈ యాప్‌లో పెట్టుబడులు పెట్టారు. తక్కువ పెట్టుబడి పెట్టిన వారు ప్రతి గురువారం, ఎక్కువ పెట్టుబడి పెట్టినవారు శుక్రవారం, భారీగా పెట్టుబడి పెట్టిన వారు సోమవారం నగదును విత్‌డ్రా చేసుకునే వీలు కల్పించారు. అయితే గత మూడు వారాల నుంచి సరిగ్గా పనిచేయని ఈ యాప్, శనివారం నుంచి పూర్తిగా నిలిచిపోయింది. దాంతో బాధితులు లబోదిబోమంటున్నారు. అయితే సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేసేందుకు వెనకాడుతున్నారు.

క్లుప్తంగా

శ్రీవరాల వెంకన్నకు విశేష పూజలు


విశేష అలంకరణలో స్వామివారు

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసి యున్న శ్రీవరాల వేంకటేశ్వరస్వామి వారికి శనివారం విశేష పూజలు జరిపారు. వేకువ జామున స్వామి వారికి సుప్రభాత సేవ, తోమాలసేవ, అర్చనలు నిర్వహించారు. అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాధికాలు జరిపారు. పరిసర ప్రాంతాలనుంచి అధిక సంఖ్యలో భక్తులు కాలినడకన వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఉచిత హోమియో వైద్య సేవలు


ఉచిత హోమియో వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం

అత్తిలి: శ్రీవిశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం బల్లిపాడు ఆశ్రమ శాఖలో శనివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీ ఉమర్ ఆలీషా రూరల్ డెవలెప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ దండు పద్మావతి సౌజన్యంతో ఉచిత హోమియో వైద్య సేవలు అందించారు. ఈ శిబిరంలో ప్రజలకు ఉచితంగా బీపీ పరీక్షలు జరిపి హోమియో మందులు అందించారు. పీఠం కార్యకర్తలు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో మేధాశక్తి


గురుకులంలో వైజ్ఞానిక ప్రదర్శనలను పరిశీలిస్తున్న సీఎంవో చంద్రశేఖర్, చిత్రంలో ఎంఈవో-2 జ్యోతి

తాడేపల్లిగూడెం రూరల్: వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా మేధాశక్తి పెరుగుతుందని సర్వశిక్ష సీఎంవో చంద్రశేఖర్ అన్నారు. శనివారం పెద తాడేపల్లి గురుకుల విద్యాలయంలో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనలను ఆయన పరిశీలించారు. అనంతరం పాఠశాల భవనాలను, కిచెన్ రూమ్, నోట్‌పుస్తకాలను పరిశీలించారు. అలాగే విద్యార్థులకు అందుతున్న వసతిపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న విద్యా వనరులను వినియోగించుకుని విద్యార్థులు ఉన్నత స్థానాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 జ్యోతి, పాఠశాల ప్రిన్సిపాల్ బి.రాజారావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

డీఈవోకు సత్కారం


డీఈవోను కలిసిన నాయకులు

తణుకు: జిల్లా విద్యాశాఖ అధికారిగా ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఈవీవీఎస్‌ఎస్‌ఎస్‌బీఎల్ నారాయణను జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘు నేతలు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. జిల్లాలో పాఠశాలల్లో ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు నేలపాటి వెంకటరమణ ఆధ్వర్యంలో గౌరవ అధ్యక్షుడు మల్లువలస నాగశ్రీ మన్నారాయణ, జిల్లా కోశాధికారి బండి ఆంజనేయులు, ఆకివీడు ఎంఈవో రవీంద్ర, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు డీఆర్‌వీ సత్యనారాయణ తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఈనెల 31న నిర్వహించనున్న ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఏరియా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఓవీ రాజు, మండలపర్తి హరీష్ కోరారు. సిపాయిపేట భవన నిర్మాణ కార్మిక సంఘం భవనంలో శనివారం నిర్వహించిన ఏఐటీయూసీ ఏరియా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆవిర్భావ దినోత్సవం రోజున ప్రతి కార్మికుడు ఏఐటీయూసీ జెండాలను ఇంటి వద్ద ఆవిష్కరించాలని కోరారు.

ఏపీబీ, ఏటీబీ ఏజెంట్ల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నరసాపురం: నరసాపురం ఆర్టీసీ డిపో పరిధిలో ఏపీబీ, ఏటీబీ ఏజెంట్ల నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్ సుబ్బన్నరెడ్డి చెప్పారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నరసాపురం-భీమవరం వయా మత్స్యపురి రూట్, వయా దిగమర్రు, పాలకొల్లు రూట్, నరసాపురం-రాజమండ్రి వయా కవిటం, సిద్ధాంతం రూట్, నరసాపురం-మచిలీటపట్నం వయా మొగల్తూరు, ముత్యాలపల్లి రూట్, నరసాపురం-హైదరాబాద్ వయా అత్తిలి రూట్‌లో అవకాశాలు ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న వారు 99592-25488 నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

అంతర సాగు.. ఆదాయం బాగు

- రెండెకరాల భూమిలో వివిధ రకాల పంటల సాగు
- ప్రకృతి విధానంలోనే సాగు చేపట్టిన రైతు


అంతర పంటలుగా కూరగాయలు, పూల మొక్కలు పెంచుతున్న దృశ్యం


కేరళకు చెందిన సునహరి రకం వరి వంగడం సాగు చేసిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: భూమిని నమ్ముకుంటే భుక్తికి లోటు లేదనే సిద్ధాంతాన్ని నమ్మాడు ఓ రైతు. దీనికి తోడు ప్రకృతి సేద్యం విధానాన్ని ఎంచుకుని అంతర పంటలు వేసి ఆదాయాన్ని సంపాదిస్తూ పలువురికి ఆదర్శప్రాయంగా నిలుస్తున్నాడు. తాడేపల్లిగూడెం మండలంలోని వెంకట్రామన్నగూడెం గ్రామానికి చెందిన నూనె శ్రీనివాస్ మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ పట్టా పొందినప్పటికీ వ్యవసాయంపై మక్కువను వదులుకోలేక భూమిని సాగు చేయడం మొదలుపెట్టాడు. దీనికి తోడు అదనపు ఆదాయం సంపాదించేందుకు పలురకాల కూరగాయలు, పూల మొక్కలను సైతం సాగు చేశాడు.

వరిసాగుతో పాటు..

ఎకరం విస్తీర్ణంలో సునహరి -150 ఎంటీ రకం (కేరళ వెరైటీ) వరి వంగడాన్ని సాగు చేస్తున్నాడు. సాధారణ వరి రకాలతో పోలిస్తే ఈ సునహరి రకం ఆరోగ్యదాయినిగా వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ రకం వరి వంగడం ప్రస్తుతం కోత దశకు చేరుకుంది. దాదాపు 35 బస్తాల దిగుబడి లభిస్తుందని రైతు నూనె శ్రీనివాస్ అంచనా వేస్తున్నాడు. దీనికితోడు 25 సెంట్లలో బంతి, చామంతి, బొప్పాయి, అరటి, మునగ, బెండకాయ, గ్యాగ్ ఫ్రూట్, దొండ, పాటన్స్, బీరకాయ, డ్రాగన్ ఫ్రూట్, మామిడి, జీడిమామిడి, చైనా కాకర, సాదా కాకర, పుదీన, పచ్చిమిర్చి, గోంగూర వంటి 22 రకాలు వేశాడు. ఈ పంటలను ప్రకృతి విధానంలో సాగు చేపట్టడానికి 30 సెంట్లలో పశువుల పాక, కోళ్ళ ఫారం నిర్వహిస్తున్నారు. వాటి ద్వారా వచ్చిన పెంటను పంటకు వినియోగిస్తున్నారు. పంటలను పురుగులు ఆశించకుండా బంతి, చామంతి వంటి పూల పంటలను సైతం సాగు చేపట్టారు. పురుగులు కూరగాయలు, పండ్లను ఆశించకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టారు. ఆయా రకాల పంటలు వారానికో రకం చేతికొచ్చేలా వృత్తాన్ని రూపొందించారు. సమ్మిళిత సాగు ద్వారా ఇప్పటి వరకు ఆరు కోతలు కోశాడు. ఇలా ఏ వారం ఖాళీ లేకుండా పంటతో పాటు ఆదాయం పొందేలా యువ రైతు నూనె శ్రీనివాస్ ఆలోచన పలువురికి స్ఫూర్తిగా నిలుస్తోంది.

ఆరోగ్యం.. ఆదాయం..



ప్రకృతి విధానంలో సాగు చేపట్టడం ద్వారా ఆరోగ్యంతో పాటు నాణ్యమైన దిగుబడులతోపాటు ఆదాయం మెండుగా లభిస్తుంది. రాబోయే తరాలు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రకృతి విధానంలో పంటలు పండించడం మేలు. తద్వారా భూమి సాంద్రత సైతం పెరుగుతుంది. ప్రతి రైతు తనకున్న భూమిలో కొంత ప్రకృతి సాగుకు వినియోగించాలి.

– నూనె శ్రీనివాస్, యువ రైతు, వెంకట్రామన్నగూడెం, తాడేపల్లిగూడెం మండలం

1468 ఎకరాల్లో ప్రకృతి సాగు



తాడేపల్లిగూడెం వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలో 1,468 ఎకరాల్లో ప్రకృతి విధానంలో సాగు చేపట్టారు. రాబోయే కాలంలో 5వేల ఎకరాల్లో నవధాన్యాలు పచ్చిరొట్ట ఎరువులను రైతులు సాగు చేసేలా అవగాహన కల్పిస్తున్నాం. దీనివల్ల భూమి సాంద్రత పెరుగుతుంది.

– గద్దె వెంకటరత్నం, ప్రకృతి సాగు జోనల్ కోఆర్డినేటర్, తాడేపల్లిగూడెం

బాణసంచా దుకాణాల ఏర్పాటుకు స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న ఫైర్, పోలీసు అధికారులు

తణుకు: బాణసంచా దుకాణాల ఏర్పాటులో నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలని తణుకు పట్టణ సీఐ కొండయ్య పేర్కొన్నారు. ఈనెల 29, 30, 31 తేదీల్లో తాత్కాలిక దీపావళి బాణసంచా షాపులు ఏర్పాటు చేసుకునేందుకు నిర్దేశించిన తణుకులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలోని స్థలాన్ని ఫైర్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవరణలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ముఖ్యంగా ఏదైనా ప్రమాదం జరిగితే బయటకు వెళ్లేందుకు వీలుగా మార్గాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. తణుకు అగ్నిమాపక శాఖ అధికారి అజయ్‌కుమార్ మాట్లాడుతూ జెడ్పీ హైస్కూలు ఆవరణలో 32 షాపులు, దువ్వ జాతీయ రహదారి ఆనుకుని మరో 18 తాత్కాలిక షాపులకు అనుమతులు ఇచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సైలు చంద్రశేఖర్, శ్రీనివాస్, పోలీసు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్తీక మాసంలో ప్రత్యేక బస్సులు

తణుకు అర్బన్: కార్తీక మాసం సందర్భంగా తణుకు ఆర్టీసీ డిపో నుంచి పుణ్యక్షేత్రాలు, విహారయాత్రలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేసినట్లు డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ శనివారం విలేకరుల సమావేశంలో తెలిపారు.

- పంచారామాలకు వచ్చే నెలలో ఆదివారాలు 3, 10, 17, 24 తేదీల్లో రాత్రి 8గంటలకు తణుకు డిపో నుంచి బస్సులు బయలుదేరుతాయన్నారు. టికెట్ ధరలకు సంబంధించి పల్లెవెలుగు రూ.720, అల్ట్రా డీలక్స్ రూ.1100, సూపర్ లగ్జరీ రూ.1200 ఉంటుందన్నారు. + 11 శైవక్షేత్రాల దర్శనం కోసం కార్తీక సోమవారాలు 4, 11, 18, 25 తేదీల్లో ఉదయం 6 గంటలకు తణుకులో బయలుదేరి శైవ క్షేత్రాల దర్శనం తరువాత అదేరోజు సాయంత్రం 6 గంటలకు తణుకు చేరుకోవచ్చన్నారు. టికెట్ ధర కేవలం రూ.350 మాత్రమేనని చెప్పారు.
- ప్రతి ఆదివారం మన్యసీమ పేరుతో విహార యాత్ర స్పెషల్ బస్ ఏర్పాటుచేశామన్నారు. ఈ బస్సులు ఆదివారం ఉదయం 5 గంటలకు బయలుదేరి విహార యాత్ర అనంతరం రాత్రి 9 గంటలకు తణుకు చేరుతాయని వివరించారు. టికెట్ ధరలు పల్లె వెలుగు రూ. 300, అల్ట్రా డీలక్స్ రూ.450, సూపర్ లగ్జరీ రూ.500 అని తెలిపారు.
- విశాఖ విహార యాత్రలో భాగంగా విశాఖపట్నంలోని సింహాచలం, కైలాసగిరి, ఉడాపార్కు, నేవి మ్యూజియమ్, సబ్‌మెరైన్, ఆర్‌కే బీచ్, కాళి టెంపుల్ ప్రాంతాలను దర్శించేందుకు ప్రత్యేక సర్వీసు నడుపుతున్నట్లు తెలిపారు. ఈ బస్సు ప్రతి శనివారం రాత్రి 9 గంటలకు తణుకులో బయలుదేరి విశాఖ విహార యాత్ర అనంతరం తిరిగి సోమవారం ఉదయం తణుకుకు చేరుకుంటాయన్నారు. టికెట్ ధర అల్ట్రా డీలక్స్ పెద్దలకు రూ.1000, పిల్లలకు రూ.750, సూపర్ లగ్జరీ పెద్దలకు రూ.1050, పిల్లలకు రూ.800గా నిర్దేశించినట్లు చెప్పారు.
- అయ్యప్ప భక్తులకు శబరిమల, శివభక్తులకు శ్రీశైలం వెళ్లేందుకు అద్దె ప్రాతిపదికన వారు కోరిన చోటు నుంచి బస్సులు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

రిజర్వేషన్ కోసం 94404 19144, వివరాలకు 73829 07027 నంబర్లలో సంప్రదించాలని డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ కోరారు. ఈ సందర్భంగా యాత్రలకు సంబంధించిన గోడపత్రికలు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆఫీసు సూపరింటెండెంట్ వెన్నా రమణమూర్తి, గ్యారేజ్ ఇన్‌చార్జి గూడూరు శ్రీనివాసరావు, జనరల్ ఏడీసీ చింతల రామకృష్ణ, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ లాల్ పాల్గొన్నారు.

క్రీడలు, కళల్లో విద్యార్థులు రాణించాలి


పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

తణుకు టౌన్: విద్యార్థులు శారీరక, మానసిక ధృడత్వానికి క్రీడలతో పాటు కళల్లోనూ ప్రావీణ్యం పెంపొందించుకోవాలని జాయింట్ కలెక్టర్ టీ రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. శనివారం తణుకులోని ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా యువజనోత్సవాలను ఆయన తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణతో కలసి ప్రారంభించారు. జేసీ మాట్లాడుతూ యువజన సర్వీసుల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న అవకాశాలను అందిపుచుకోవాలన్నారు. ఈ యువజనోత్సవాల్లో నిర్వహించిన వివిధ పోటీల్లో తాడేపల్లిగూడెం, గణపవరం, పాలకొల్లు, భీమవరం ప్రాంతాలకు చెందిన వివిద ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో వై భవానీ శంకరి, సెట్‌వెల్ సీఈవో కేఎస్ ప్రభాకరరావు, కళాశాల ప్రిన్సిపాల్ యూ లక్ష్మీసుందరిబాయి, కళాశాల జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు, వివేకానంద గ్లోబల్ స్కూల్ కార్యదర్శి చిట్టూరి రీనా సాయి, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


పాతూరు ఇండోర్ సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ వైర్లకు తగులుతున్న చెట్లు కొమ్మలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ వైర్లకు చెట్లు కొమ్మలు తగిలి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. దీంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ప్రతి వారం ఒక రోజు విద్యుత్ వైర్లకు అడ్డంగా ఉన్న చెట్లు కొమ్మలను తొలగించే కార్యక్రమం చేపడుతున్నా అది పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. దీంతో పలు చోట్ల చెట్ల కొమ్మలు పెరిగి విద్యుత్ తీగలను తాకుతున్నాయి. ఆ సమయంలో విద్యుత్ తీగల నుంచి మంటలు రావడం, నిప్పు రవ్వలు ఎగిసి పడుతుండడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. పాతూరు ఇండోర్ సబ్ స్టేషన్ వద్ద నేరుగా చెట్లు కొమ్మలు విద్యుత్ వైర్లుకు తగులుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పట్టణంలోని పాతూరులో చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తొలగించేందుకు వీలుగా చెట్లు కొమ్మలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

మొక్కల పంపిణీ


బోడపాడులో మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పెంటపాడు: పర్యావరణ పరిరక్షణతో పాటు, మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ సాధ్యమని మానవత జిల్లా మాజీ చైర్మన్, జిల్లా పర్యావరణ చైర్మన్ తాడేపల్లి మోహనరావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని బోడపాడు వద్ద మానవత మండల శాఖ సమావేశం మండల అధ్యక్షుడు మీసాల సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. అనంతరం గ్రామస్తులకు సుమారు 300 కొబ్బరి మొక్కలను పంపిణీ చేశారు. వాటిని పలు ప్రాంతాల్లో నాటి పరిరక్షించాలని గ్రామస్తులను కోరారు. ఎంఈవో టీవీ రామకృష్ణ, జాతీయ మృదంగ విద్యాంసులు సరస్వతుల హనుమంతరావు, పీబీ శ్రీనివాసాచార్యులు, మానవత నాయకులు విప్పర్తి వినాయకుడు, నక్కా సాంబశివరావు, హెచ్‌ఎం ఎ. వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయుడు రాజా టైటస్ పాల్గొన్నారు.

కేన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలి


కేన్సర్ అవగాహన శిబిరంలో లయన్స్ క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కేన్సర్ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా మహిళలు రొమ్ము కేన్సర్ పట్ల అవగాహన కలిగి ఉండాలని లయన్స్‌క్లబ్ ఐపీడీజీ లయన్ గట్టిం మాణిక్యాలరావు పేర్కొన్నారు. పట్టణంలోని ఉమర్ అలీషా పీఠంలో జీఎస్‌ఎల్ కేన్సర్ ఆసుపత్రి డాక్టర్లు సింధూషా, అమృత, పార్థసారథి, సిబ్బందిచే డైమండ్స్ ఆధ్వర్యంలో కేన్సర్‌పై అవగాహన శిబిరం శనివారం నిర్వహించారు. జీఎంఏ కోఆర్డినేటర్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు, డాక్టర్ ఎల్‌ఎస్‌వీ నాగేశ్వరరావు, యోగా గురువు కరిబండి రామకృష్ణ, కాళ్ళ గోపికృష్ణ ఏర్పాట్లు పర్యవేక్షించారు. మహిళ సమస్యలను అడిగి తెలుసుకుని, వారికి సలహాలు, సూచనలు అందజేశారు. చెన్నారెడ్డి సతీష్ నాయుడు, కార్తీక్, సుభద్రగుప్తా, ప్రియాంక, ఆంజనేయస్వామి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి ఉపవాస పండుగలు

పెంటపాడు: ఈనెల 28వ తేదీ నుంచి బి.కొండేపాడు సీయోను మందిరంలో ఉపవాస పండుగలు నిర్వహించనున్నట్లు సంఘ కాపరి ఎం.సాల్మన్‌రాజు తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమాల్లో తణుకు ఈపీఎఫ్ సంఘ అధ్యక్షుడు పి.మోజెస్ ప్రవీణ్, నిజామాబాద్‌కు చెందిన బ్రదర్ రమేష్‌జాన్, పాస్టర్ ఎం.జోసఫ్, సువార్త గాయకులు సాల్మన్‌రాజు తదితరులు పాల్గొంటారన్నారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని దైవ దీవెనలు పొందాలని కోరారు.

నేడు రంగస్థల కళాకారుల సంఘ సమావేశం

తాడేపల్లిగూడెం (టీఓసీ): రంగస్థల కళాకారుల సంఘ సమావేశం ఆదివారం సాయంత్రం పట్టణంలోని 3వ వార్డు వీకర్స్ కాలనీ నాన్న మునిసిపల్ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు సూరంపూడి వెంకట రమణ తెలిపారు. గౌరవ సత్కారాలు, కళా సత్కారాలు, ఉద్యోగ సేవా పురస్కారం, ఆర్థిక సత్కారంలు ఉంటాయన్నారు. కళాకారులు, ప్రజలు, అభిమానులు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధి పనులు పారదర్శకంగా నిర్వహించాలి


అత్తిలిలో ప్రజావేదిక కార్యక్రమంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు

అత్తిలి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిర్వహించే పనులు నిబంధల ప్రకారం పారదర్శకంగా చేపట్టాలని డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు మండలంలో జరిగిన పనులపై శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా వేదిక నిర్వహించారు. ఈసందర్భంగా డ్వామా పీడీ అప్పారావు మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 17వ విడత సామాజిక తనిఖీలో భాగంగా గ్రామ పంచాయతీలో సంపూర్ణ తనిఖీ పూర్తిచేసి, ప్రజల సమక్షంలో గ్రామ సభలను నిర్వహించడం జరిగిందన్నారు. అత్తిలి మండలంలో 922 పనులకు గాను ఉపాధి కూలీలకు, మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.7.97 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. సామాజిక తనిఖీల్లో రూ.17,744 నిధులు దుర్వినియోగమైనట్లుగా గుర్తించి వాటిని ఉపాధి హామీ సిబ్బంది నుంచి రికవరీకి ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహించిన ఉపాధి సిబ్బందికి రూ.6,500 ఫైన్ విధించారు. రూ.2,67,590తో చేపట్టిన పలు పనులకు సంబంధించి విచారణ చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. రూ.79.931 విలువగల పనులకు రెక్టిఫికేషన్ చేయాలని చెప్పారు. పంచాయతీ రాజ్ విభాగం నుంచి చేపట్టిన పనులకు సంబంధించి రూ.23,857 రికవరీకి ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు ఆనాల ఆదినారాయణ, పూతినీడి శ్రీనివాస్, జిల్లా అంబుడ్స్‌మెన్ అధికారి ఆదినారాయణ, జిల్లా విజిలెన్స్ అధికారి కె పురుషోత్తం, ఎంపీడీవో శామ్యూల్, ఎస్‌ఆర్‌పీ ఎం గోవింద్, ఏపీఓ ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రేపు గూడెంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని ఎల్ఐసీ ఆఫీస్ వద్ద ఉన్న శ్రీ వాసవి డిగ్రీ, పీజీ కళాశాలలో సోమవారం ఉదయం 10 గంటలకు ఏపీ స్టేట్ స్కిల్ డెవలెప్‌మెంట్ (ఏపీఎస్‌ఎస్‌డీసీ) వారిచే ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మద్దాల రామకృష్ణ వెల్లడించారు. ఈ డ్రైవ్‌కు అరబిందోఫార్మా, ముత్తూట్ ఫైనాన్స్, స్టాఫింగ టైటాన్స్, బిగ్ బాస్కెట్, ఎల్ అండ్ టీ ఫైనాన్స్, డీమార్ట్, యురేకా ఫార్బ్స్, స్విగ్గీ కంపెనీలు హాజరవుతాయన్నారు. ఐటీఐ, డిప్లమో, ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, బీ.ఫార్మసీ తదితర విద్యార్హత కలిగిన నిరుద్యోగులు హాజరై ఉద్యోగాలు పొందాలన్నారు. వివరాలకు 98661 81910, 98483 12271 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

విద్యుత్ బిల్లుల పెంపుతో ప్రజలపై భారం

పాలకొల్లు అర్బన్: ప్రజలపై ఎలాంటి పన్నుల భారం మోపమని ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఆ హామీలను విస్మరించి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి దేవ రాజేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రైతు భరోసా హామీని చంద్రబాబు తుంగలోకి తొక్కి కనీసం పంటల బీమా ప్రీమియం కూడా రైతులపైనే భారం మోపారని ఆయన విమర్శించారు. నాలుగు నెలల పాలనలో చంద్రబాబు రాష్ట్ర ప్రజల ఆశలను ఒమ్ము చేశారని పేర్కొన్నారు. విద్యుత్ బిల్లులు భారం మోపి ప్రజల నెత్తిన టోపి పెట్టారని మండిపడ్డారు. కేవలం కక్ష సాధింపు రాజకీయాలతో, రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని రాజేష్‌కుమార్ విమర్శించారు.

వివాదానికి దారి తీసిన ఈఓ నిర్ణయం

నరసాపురం: పట్టణంలోని శ్రీకపిలమల్లేశ్వరస్వామి దేవస్థానం ఈవో కె.రామచంద్రరావు తీసుకున్న నిర్ణయం వివాదానికి దారితీసింది. ఈ ఏడాది కార్తీకమాసంలో దర్శనానికి వచ్చే భక్తులకు టికెట్ పెట్టాలని ఈఓ ప్రతిపాదించారు. అయితే ఈ విషయం తెలుసుకున్న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నాయకులు శనివారం ఈఓతో వాగ్వివాదానికి దిగారు. ఎప్పుడూలేనిది ఇలాంటి నిర్ణయాలతో భక్తులపై భారం వేయడం ఏంటి? అని ప్రశ్నించారు. వారి ఆందోళనతో ఈఓ ప్రతిపాదన ఉపసంహరించుకోవడంతో వివాదం సద్దుమణిగింది.

ఫెర్రీ బకాయి చెల్లింపునకు అంగీకారం

నరసాపురం రూరల్: గత ఆర్థిక సంవత్సరం మాధవాయిపాలెం ఫెర్రీ పాటదారుడు బకాయి పడిన సొమ్మును మూడు వాయిదాల్లో చెల్లించేందుకు పాటదారుడు అంగీకరించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జెఏసీ సమావేశం నిర్వహించారు. అందులో పాల్గొన్న సభ్యులు బకాయి మొత్తం చెల్లించాలని పాటదారుడిని ఆదేశించారు. దీంతో పాటదారుడు ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి మూడు వాయిదాల్లో బకాయి సొమ్ము చెల్లించే విధంగా పోస్ట్ పెయిడ్ చెక్కులను మండలపరిషత్ అధికారులకు అందజేశారు. ఈ సమావేశంలో ఎంపీపీ మైలాబత్తుల సోనీ, ఎంపీడీవో గాదిరాజు రామకృష్ణంరాజు, నరసాపురం, సఖినేటిపల్లి మండలాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 195 మంది ఎంపిక

పాలకొల్లు సెంట్రల్: అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 195 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి రాజరాజేశ్వరి తెలిపారు. శనివారం జరిగిన ఈ జాబ్‌మేళాలో 18 మల్టీ నేషనల్ కంపెనీలు పాల్గొన్నాయన్నారు. మొత్తం 305 మంది విద్యార్థులు పాల్గొనగా 195 మంది ఎంపికయ్యారన్నారు. వీరిలో హెట్రోమోటర్స్ 51, డైకిన్ 30, అపోలో ఫార్మసి 14, నవత ట్రాన్స్‌పోర్ట్ 5, ఇండో ఎంఎం 13, పానసోనిక్ 11, హ్యూందాయ్ 2, ఫాక్స్‌కాన్, ప్రీమియర్ అంజనీ ఫౌండేషన్స్ 45 మందిని ఎంపికయ్యారని వివరించారు. వీరిలో 104 మంది విద్యార్థులు తమ కళాశాలకు చెందిన పూర్వ, ప్రస్తుత విద్యార్థులు ఉన్నారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్‌వీ రంగారావు, కారుమూరి రామలింగేశ్వరరావు, టి.కృష్ణ, కె.భద్రాచలం, ఎం.శిరీష తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి


భీమవరంలో గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: విద్యార్థులు కేవలం విద్యాభ్యాసానికే పరిమితం కాకుండా క్రీడలు, కల్చరల్స్ వంటి వివిధ రంగాల్లో రాణించినపుడే ఉన్నత స్థానాల్లో ఉంటారని త్రిపుర గవర్నర్ ఎస్.ఇంద్రసేనారెడ్డి అన్నారు. శనివారం భీమవరం పట్టణంలోని భారతీయ విద్యా భవన్స్ స్కూల్లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మన దేశంలోని విద్యకు ఒక ప్రత్యేకత ఉందని అందువల్ల ఇక్కడ విద్యనభ్యసించిన అనేకమంది ఇతర దేశాల్లో అనేక రంగాల్లో రాణిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణించిన స్కూల్ విద్యార్థులను గవర్నర్ సత్కరించారు. ముందుగా త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎస్పీ, అద్నాన్ నయీం అస్మి, పుష్పగుచ్ఛాలిచ్చి స్వాగతం పలికారు. అలాగే పోలీసు గౌరవవందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, భవన్స్ చైర్మన్ యూకే విశ్వనాథరాజు, అచ్యుతరామరాజు, పోలిశెట్టి సత్యనారాయణ(దాసు) శ్రీనివాసరాజు, ఆర్డీవో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ ఆర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను వినియోగించుకోవాలి

పాలకోడేరు: కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎన్నో కొత్త పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందని త్రిపుర గవర్నర్ ఎస్ ఇంద్రశేనారెడ్డి అన్నారు. శనివారం ఆయన విస్సాకోడేరులో పర్యటించారు. ఈ సందర్భంగా పురిగెళ్ళ రఘరామ్ నివాసాన్ని ఆయన సందర్శించారు. పురిగెళ్ళ రాధాకృష్ణమూర్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టుమెషీన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని పలువురు మహిళలకు మిషన్లు అందజేశారు.